క్లుప్తంగా

రైతు బజార్లలో కూరగాయల ధరలు

వనస్థలిపురం: సరూర్‌నగర్/వనస్థలిపురం రైతుబజార్లలో కూరగాయల ధరలు... (కిలో... రూపాయల్లో) టమాటా 11, వంకాయ 40, బెండ 28, పచ్చిమిర్చి 35, కాకర 23, బీర 18, క్యాబేజీ 13, ఫ్రెంచిబీన్స్ 50, క్యారెట్ 43, దొండ 19–23, చిక్కుడు 60, గోకర 23, బీట్‌రూట్ 25, క్యాప్సికం 40, ఆలు 22, కీర 28, దోస 15, సొర 13, పొట్ల 13, ఉల్లిగడ్డ 26, చామగడ్డ 35. ఈ ధరలు గురువారం ఉదయం 9 గంటల వరకు మాత్రమే అమలులో ఉంటాయి.

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి



ఎల్‌ఓసీ పత్రాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే బలాల

మలక్‌పేట: ప్రభుత్వ పథకాలను అర్హులందరూ సద్వినియోగం చేసుకోవాలని మలక్‌పేట ఎమ్మెల్యే అహ్మద్ బలాల అన్నారు. పంజేషాహలోని కార్యాలయంలో ఆయన మంగళవారం రాత్రి మూసారంబాగ్, ఓల్డ్‌మలక్‌పేట ప్రాంతాలకు చెందిన లబ్ధిదారులకు రూ.2.50 లక్షల విలువ చేసే ముఖ్యమంత్రి సహాయ నిధి ఎల్‌ఓసీ పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బలాల మాట్లాడుతూ..కాలనీలు, బస్తీల్లోని సమస్యలను నేరుగా తన దృష్టికి తీసుకురావాలని కోరారు. అర్హులైన వారందరికీ అభివృద్ధి, సంక్షేమ ఫలాలు అందేందుకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో పలువురు మజ్లిస్ నాయకులు పాల్గొన్నారు.

సుధీర్‌రెడ్డి ఘన విజయానికి కృషి: జిన్నారం



సమావేశంలో పాల్గొన్న మాజీ కార్పొరేటర్లు, బీఆర్ఎస్ నాయకులు

ఎల్‌బీ నగర్: రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో ఎల్‌బీనగర్ బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి, ప్రస్తుత ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి ఘన విజయానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తామని మాజీ కార్పొరేటర్ జిన్నారం విఠల్‌రెడ్డి అన్నారు. బుధవారం సుధీర్‌రెడ్డి నివాసంలో మాజీ కార్పొరేటర్ల ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా విఠల్‌రెడ్డి మాట్లాడుతూ, ఎమ్మెల్యే సుధీర్ రెడ్డితో తనకు ఎలాంటి విభేదాలు లేవని స్పష్టం చేశారు. త్వరలో మాజీ కార్పొరేటర్ల ఆధ్వర్యంలో చైతన్యపురిలో బీఆర్ఎస్ కార్యకర్తలతో భారీ సమావేశం ఏర్పాటు చేస్తామన్నారు. ఎల్‌బీనగర్‌లో ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి చేపట్టిన అభివృద్ధి పనులు భవిష్యత్ తరాలకు ఎంతో ఉపయోగపడేలా ఉన్నాయన్నారు. మాజీ కార్పొరేటర్లు, పార్టీ నాయకులు ఎం.శ్రీనివాసరావు, సాగర్‌రెడ్డి, జిట్టా రాజశేఖర్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, సంగీత, మహేశ్, నర్సిరెడ్డి, సుజీత్, శ్రీనివాస్ పాల్గొన్నారు.


గెజిటెడ్ హెడ్మాస్టర్లకు సన్మానం



సన్మానిస్తున్న పీఆర్‌టీయూ నాయకులు

మలక్‌పేట: పీఆర్‌టీయూ టీఎస్ సైదాబాద్ మండల కమిటీ ఆధ్వర్యంలో బుధవారం గెజిటెడ్ హెడ్మాస్టర్లుగా బాధ్యతలు చేపట్టిన వరప్రసాద్ రెడ్డి (కాచిగూడ, శారద (గడ్డిఅన్నారం), అస్రా ఫాతీమా (ప్రభుత్వ అంధుల పాఠశాల మలక్‌పేట), డి.సుకన్య (శంకేశ్వర్‌బజార్), లక్ష్మీ (మాదన్నపేట)లను సన్మానించారు. కార్యక్రమానికి హైదరాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి తిరుపతిరెడ్డి, మండల కమిటీ అధ్యక్షుడు మందడి వెంకట్‌రెడ్డి ప్రధాన కార్యదర్శి లక్ష్మీనారాయణ, రాష్ట్ర ఉపాధ్యక్షులు శ్రీనివాస్‌రెడ్డి, రఘువీర్‌రెడ్డి, దామోదర్‌రెడ్డి పాల్గొన్నారు.

బ్యాడ్మింటన్‌లో శశిధర్‌కు రజత పతకం



శశిధర్‌ను అభినందిస్తున్న కోచ్ బాల హనుమంతరావు

చైతన్యపురి: ఇటీవల కొరియా జియోంజులో నిర్వహించిన బ్యాడ్మింటన్ డీడబ్ల్యూఎఫ్ ప్రపంచ సీనియర్ చాంపియన్‌షిప్ 2023లో భారత క్రీడాకారుడు శశిధర్ 45 ప్లస్ పురుషుల సింగిల్స్ విభాగంలో రజత పతకం సాధించారు. ఈ సందర్భంగా శశిధర్ బ్యాడ్మింటన్ అకాడమీలో అభినందన సభ నిర్వహించారు.కోచ్ బి.బాల హనుమంతరావు, మేనేజర్ జనరల్ రాజేష్ కుంద్రా మాట్లాడుతూ, దేశం గర్వించేలా శశిధర్ ప్రపంచ సీనియర్ చాంపియన్‌షిప్‌లో రజతం సాధించారని అన్నారు. ఈ విజయం నేటి తరం క్రీడాకారులకు ఎంతో ఉత్తేజాన్ని కల్గిస్తుందన్నారు.

సా..గుతున్న విచారణ...

ఆగని అక్రమ నిర్మాణం!

- జైళ్ల శాఖ స్థలంలో ఊపందుకున్న భవన నిర్మాణం
- పోలీసు శాఖకు అప్పగించామంటున్న జైళ్ల శాఖ
- కబ్జాదారుడికి వరంగా మారిన శాఖల మధ్య సమన్వయ లోపం



సైదాబాద్‌లో జైళ్ల శాఖ స్థలంలో అక్రమ నిర్మాణం

చంచల్‌గూడ: సైదాబాద్ క్రాస్ రోడ్డులోని జైళ్ల శాఖకు చెందిన దాదాపు రూ.3 కోట్ల విలువైన స్థలం కబ్జాకు గురైన విషయం తెలిసిందే. జైళ్ల శాఖ స్థలం కబ్జా చేసి అక్రమ నిర్మాణాలు చేపట్టారని గుర్తించిన బీజేపీ కుర్మగూడ మాజీ కార్పొరేటర్ సహదేవ్‌యాదవ్ గత జూన్‌లో తెలంగాణ జైళ్ల శాఖ డీజీ, చంచల్‌గూడ సూపరింటెండెంట్‌కు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు జైళ్ల శాఖ స్థలాన్ని పరిశీలించిన చంచల్‌గూడ సూపరింటెండెంట్ నవాబు శివకుమార్ గౌడ్ తమ శాఖకు చెందిన స్థలం కబ్జా చేసి అక్రమ నిర్మాణాలు చేపట్టిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని సైదాబాద్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

- ఫిర్యాదుకు సంబంధించి 447, 427 సెక్షన్ల కింద ఎఫ్ఐఆర్ 257/2023 నమోదైంది. అదే విధంగా జీహెచ్‌ఎంసీ టౌన్‌ప్లానింగ్ శాఖకు కూడా లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు.
- ఈ నేపథ్యంలో ఆగిన అక్రమ నిర్మాణం పనులు మళ్లీ ఊపందుకోవడం అనుమానాలకు తావిస్తోంది.
- ఇదే విషయమై జైళ్ల శాఖ అధికారులను వివరణ కోరగా, స్థలం స్వాధీనం చేసుకోవాలని సౌత్‌ఈస్ట్ జోన్ డీసీపీకి లిఖితపూర్వకంగా లేఖ రాశామని తెలిపారు. స్థలం కాపాడుకుంటారో...కబ్జాదారులకే వదిలేస్తారో పోలీసు శాఖ తెల్చుకోవాల్సి ఉందని అన్నారు.
- ఇదే అంశంపై 'సాక్షి' డీసీపీని ఫోన్‌లో వివరణ కోరగా...జైలు సూపరింటెండెంట్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని, స్థలం పత్రాలకు సంబంధించి విచారణ కొనసాగుతోందన్నారు. అక్రమ కట్టడాలకు సంబంధించి జీహెచ్‌ఎంసీ చర్యలు తీసుకోవాల్సి ఉందని, ఆ శాఖకు లేఖ కూడా రాశామన్నారు.
- ఇదే అంశమై జీహెచ్‌ఎంసీ టౌన్‌ప్లానింగ్ ఏసీపీని వివరణ కోరగా.. ఈ ఫిర్యాదుపై తనకు అవగాహన లేదని, ప్రస్తుతం ఎన్నికల బిజీలో ఉన్నామని సమాధానం ఇచ్చారు.
- ప్రైవేట్ స్థలాల్లో అక్రమ కట్టడాలకు సంబంధించి యుద్ధ ప్రతిపాదికన స్పందించే టౌన్ ప్లానింగ్ శాఖ ఈ వ్యవహారంలో మాత్రం మెతక వైఖరి అవలంభిస్తున్నట్లు స్పష్టమవుతోంది.
- శాఖల మధ్య సమన్వయలోపం కబ్జాదారుడికి కలిసి వస్తోందని, ఇది ఇలాగే కొనసాగితే రాష్ట్ర ప్రభుత్వం విలువైన స్థలాన్ని కోల్పోవాల్సి వస్తుందని స్థానికులు అంటున్నారు.

రోల్ మోడల్‌గా తీర్చిదిద్దడమే లక్ష్యం: ఎమ్మెల్యే



మార్నింగ్ వాక్‌లో సత్యానగర్‌లోని సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

నాగోలు: ఎల్‌బీనగర్ నియోజకవర్గ పరిధిలోని ప్రధాన సమస్యలు ఒక్కొక్కటిగా పరిష్కరిస్తూ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో రోల్ మోడల్‌గా తీర్చిదిద్దడమే తన లక్ష్యమని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. మార్నింగ్ వాక్‌లో భాగంగా బుధవారం ఉదయం 5 గంటల నుంచి కొత్తపేట డివిజన్ సత్యానగర్ కాలనీలో స్థానికులతో కలిసి ఆయన పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా కాలనీవాసులు పలు సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. సత్యానగర్‌లో అంతర్గత రోడ్లు, కొత్తగా డ్రెయిన్లు వేయాలని, నల్ల పోచమ్మ ఆలయం దగ్గర కొత్త రోడ్డు, అదనంగా తాగునీటి పైప్‌లైన్, హరిహర క్షేత్రం ఎదురుగా ఉన్న పార్క్‌లో వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేయాలని కోరారు. కాలనీలోని కమ్యూనిటీ హాల్ మొదటి అంతస్తులో కనీస వసతులు కల్పించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ, కాలనీవాసులు పేర్కొన్న సమస్యలను ఒక్కొక్కటిగా పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. కాలనీలో కొత్త డ్రెయిన్, అంతర్గత రోడ్లు మంజూరు చేశామన్నారు. తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో కొత్తపేట డివిజన్ మాజీ కార్పొరేటర్ సాగర్ రెడ్డి, బీఆర్ఎస్‌డివిజన్ అధ్యక్షుడు లింగాల రాహుల్ గౌడ్, మహిళా అధ్యక్షురాలు శ్వేతారెడ్డి, మహేష్‌రెడ్డి, ఉదయ్, విజయ, ఇటికల యాదగిరి, నగేష్, పులికంటి వెంకట్, బట్టు అంజయ్య, కాలనీ అధ్యక్షుడు మనోహర్ ప్రసాద్ శుక్లా, మల్లికార్జున రెడ్డి, రమణ, నాగు, కాలనీవాసులు పాల్గొన్నారు.

సప్త వర్ణాలు ప్రకృతిలో నిక్షిప్తం

సైదాబాద్: ఇంద్రధనుస్సులోని సప్త వర్ణాలు ప్రకృతి అంతటా నిక్షిప్తమై ఉన్నాయని ప్రముఖ విద్యావేత్త, కేంబ్రిడ్జ్ విద్యాసంస్థల అధిపతి కె.శంతన్‌కుమార్ అన్నారు. బుధవారం సైదాబాద్ డివిజన్ కరణ్‌బాగ్ కాలనీలోని కేంబ్రిడ్జ్ ఉన్నత పాఠశాలలో కిండర్ గార్డెన్, ప్రాథమిక తరగతుల విద్యార్థులు ×ఇంద్రధనుష్ కా హల్‌చల్ । పేరిట నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. అడవిలో వివిధ రంగుల్లో ఉండే జంతువులు, సముద్రంలో భిన్న రంగుల్లోని చేపలు, పలురంగుల్లో ఉండే కూరగాయలు, పండ్లు వంటి అంశాల్లో విద్యార్థులు నమూనాలతో ప్రదర్శించారు. ప్రిన్సిపాల్ రూనీస్, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, సిబ్బంది పాల్గొన్నారు.

కొత్తపేట వినాయక నిమజ్జన ఉత్సవ కమిటీ ఎన్నిక

నాగోలు: కొత్తపేట చౌరస్తా గణేశ్ నిమజ్జన ఉత్సవ కమిటీ (అఖిల పక్షం)ని బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వ్యవస్థాపక అధ్యక్షుడిగా కాసారపు లక్ష్మీనారాయణ, ముఖ్య సలహాదారులుగా పున్న గణేశ్,రంగారెడ్డి, ప్రేమ్ గాంధీ, నిమజ్జన ఉత్సవ కమిటీ అధ్యక్షుడిగా కొండా గిరి, ప్రధాన కార్యదర్శిగా బండి మధుసూదన్ రావు, కోశాధికారిగా కొత్త జగన్, సహాయ కార్యదర్శులుగా సైదులు, అనంతుల ప్రహ్లాద్, జిన్నం వెంకటేశ్వర్లు, గొదల వెంకట్ రెడ్డి, కమిటీ సభ్యులుగా అభినవ్, ఎడ్ల బాలరాజు, ఎడ్ల శివ కుమార్, సత్యనారాయణ, రవిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గత 28 ఏళ్లుగా కొత్తపేట చౌరస్తాలో గణేశ్ నిమజ్జన అఖిల పక్షం ఆధ్వర్యంలో నిమజ్జనం రోజు స్వాగత వేదిక ఏర్పాటు చేసి గణనాథుడులకు స్వాగతం పలుకుతూ భక్తులకు ప్రసాదం, తాగునీటి సౌకర్యం కల్పిస్తున్నామని, అదే విధంగా ఈ ఏడాది కూడా భక్తులకు వసతులు కల్పించనున్నట్లు చెప్పారు.

కేంద్ర ప్రభుత్వానికి మహిళా మోర్చా కృతజ్ఞతలు



ప్రధాని మోదీ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న రంగారెడ్డి అర్బన్‌జిల్లా మహిళామోర్చా నాయకులు

మన్సూరాబాద్: పార్లమెంట్‌లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లను కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఆమోదింపజేయడంపై హర్షం వ్యక్తం చేస్తూ బీజేపీ రంగారెడ్డి అర్బన్‌జిల్లా మహిళా మోర్చా ఆధ్వర్యంలో బుధవారం ఎల్‌బీనగర్‌లో ప్రధాని మోదీ చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షురాలు నాగినేని కృష్ణవేణి మాట్లాడుతూ, దేశానికి స్వాతంత్ర్యం 1947 ఆగస్టు 15న వస్తే పార్లమెంట్‌లో మహిళా బిల్లు ఆమోదించిన రోజున మహిళలకు స్వాతంత్ర్యం వచ్చినట్లన్నారు. మహిళలకు 33 శాతం రిజర్వేషన్లతో మహిళాబిల్లును అమలు చేయటానికి పూనుకున్న కేంద్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. నాయకులు నందికొండ గీతారెడ్డి, శ్యామలదేవి, చిల్కూరి మాధవి, మన్నెం అరుణ, కవితారెడ్డి, అరుణ్‌సింగ్, కర్నాటి మాధవి, రేవతి, రోజా పాల్గొన్నారు.

అన్ని రోడ్లకు మరమ్మతులు చేపట్టాలి

ఎల్‌బీనగర్: గణేశ్ నిమజ్జన సమయంలో అన్ని రోడ్లకు మరమ్మతులు చేయాలని బీఎన్‌రెడ్డి నగర్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి అధికారులకు సూచించారు. బీఎన్‌రెడ్డి నగర్ డివిజన్ పరిధిలోని జక్కిడి నగర్, శ్రీనివాస కాలనీ, సౌభాగ్య నగర్, గాయత్రీ నగర్, బ్యాంక్ కాలనీ, ఏపీఆర్ క్రిస్టల్ ఎవెన్యూ, గాయత్రి నగర్ ఫేజ్– 2 కాలనీల్లో వర్షాల వల్ల రోడ్లన్నీ గుంతలమయంగా మారి రాకపోకలకు ఇబ్బందికరంగా ఉందని, గణేశ్ నిమజ్జన సమయంలో చాలా అవస్థలు పడతామని కాలనీవాసులు బుధవారం కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డికి సమాచారం అందజేశారు. వెంటనే స్పందించిన ఆయన సంబంధిత వాహనంతో రోడ్లకు మరమ్మతులు చేయించాలని అధికారులకు సూచించారు. దీంతో అధికారులు వెంటనే రోడ్లకు మరమ్మతులు చేపట్టారు.



జేసీబీతో రోడ్డుకు మరమర్మతు చేస్తున్న దృశ్యం

ఎమ్మెల్సీ కవిత పోరాటం ఫలించింది



ఎమ్మెల్సీ కవితతో కలిసి హర్షం వ్యక్తం చేస్తున్న స్వర్ణలతారెడ్డి, స్వప్నాసుందర్‌రెడ్డి తదితరులు

సైదాబాద్: చట్టసభల్లో మహిళా రిజర్వేషన్లపై ఎమ్మెల్సీ కవిత పోరాటం ఫలించిందని సైదాబాద్, ఐఎస్ సదన్ డివిజన్ల మాజీ కార్పొరేటర్లు సింగిరెడ్డి స్వర్ణలతారెడ్డి, సామ స్వప్నాసుందర్‌రెడ్డి అన్నారు. పార్లమెంట్‌లో మహిళా రిజర్వేషన్ల బిల్లును ప్రవేశపెట్టడంపై వారు బుధవారం ఎమ్మెల్సీ కవితను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. జీహెచ్‌ఎంసీ మేయర్ విజయలక్ష్మి, కార్పొరేటర్లు, మాజీ కార్పొరేటర్లతో కలిసి వారు సందడి చేశారు. మహిళా బిల్లు కోసం పోరాటం చేసిన ఎమ్మెల్సీ కవితకు మహిళా నాయకులు అభినందనలు తెలిపారు.

చిల్లర రాజకీయాలు మానుకోవాలి: బీఆర్ఎస్



మాట్లాడుతున్న మురుకుంట్ల అరవింద్‌శర్మ, పెండ్యాల నగేష్ తదితరులు

దిల్‌సుఖ్‌నగర్: బీజేపీ నాయకులు ఫ్లెక్సీల చిల్లర రాజకీయాలు మానుకోవాలని మహేశ్వరం నియోజక వర్గం బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి మురుకుంట్ల అరవింద్ శర్మ అన్నారు. ఆర్‌కేపురంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. జీహెచ్‌ఎంసీ అధికారులు ఫ్లెక్సీలు తొలగిస్తే మంత్రి సబితారెడ్డికి ఏం సంబంధమని, ఈ విషయంలో బీజేపీ నేత అందెల శ్రీరాములు అవగాహన లేకుండా మాట్లాడుతున్నాడని అన్నారు. జీహెచ్‌ఎంసీ అధికారులు బీఆర్ఎస్ పార్టీ నాయకులు కట్టిన ఫ్లెక్సీలకు కూడా చలాన్లు విధించారన్నారు. ఫ్లెక్సీలు తొలగించాలని మంత్రి అనుకుంటే మీ పార్టీ ఫ్లెక్సీలు ఒక్కటైనా ఉంటుందా అని ప్రశ్నించారు. పాదయాత్ర పేరుతో కాలనీలు తిరుగుతూ నాయకులకు, ప్రజలకు ఇష్టం లేకున్నా బీజేపీ కండువాలు కప్పి సోషల్ మీడియాలో వారిని బద్నాం చేస్తున్నారని అరవింద్ శర్మ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఫ్లెక్సీల కోసం జీహెచ్‌ఎంసీ ఎదుట ధర్నా చేశారు కానీ.. మహేశ్వరం నియోజకవర్గంలోని సమస్యలపై ఏనాడైనా ధర్నా చేశారని అన్నారు. ఇప్పటికైనా బీజేపీ రౌడీ రాజకీయాలు మానుకోవాలని, లేకుంటే తీవ్ర పరిణామాలు ఉంటాయని హెచ్చరించారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు పెండ్యాల నగేష్, నియోజకవర్గ అధికార ప్రతినిధి మంత్రి రవీందర్ రావు, ఆర్గనైజేషన్ సెక్రటరీ దుబ్బాక శేఖర్, నియోజక వర్గ ఉద్యమకారుల కన్వీనర్ న్యాల కొండ శ్రీనివాస్ రెడ్డి, గొడుగు శ్రీనివాస్ , రామాచారి, కొండ్ర శ్రీనివాస్, లింగ స్వామి గౌడ్, వెంకటేష్ గౌడ్, ఎస్కే మహమ్మద్, ముచింతల జగన్, శ్రీమాన్ నారాయణ, పెంబర్తి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

బీమా సుగమ్‌తో నిరుద్యోగం

హుడాకాంప్లెక్స్: బీమా సుగమ్ వల్ల దేశవ్యాప్తంగా పనిచేస్తున్న పదహారు లక్షల మంది ఇన్సూరెన్స్ ఏజెంట్ల జీవితాలు రోడ్డున పడతాయని ఆలిండియా లియాఫీ 64 సెక్రటరీ జనరల్ శ్రీనివాసచారి అన్నారు. బుధవారం సరూర్‌నగర్ మండల కేంద్రంలోని లియాఫీ భవన్‌లో జరిగిన ఎల్ఐసీ ఆఫ్ ఇండియా చైతన్యపురి బ్రాంచి ఏజెంట్ల ఈసీ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు.

జైజై గణేశా.. జయములివ్వు గణేశా!



గడ్డిఅన్నారం పీ అండ్ టీ కాలనీ మండపంలో... ఎల్‌బీనగర్ డీసీపీ సాయిశ్రీ, కాలనీ మహిళలు

ఎల్బీనగర్, మలక్‌పేట నియోజకవర్గాల పరిధిలో వినాయక నవరాత్రి ఉత్సవాలు కనుల పండువగా జరుగుతున్నాయి. కాలనీలు, బస్తీల్లో ఏర్పాటు చేసిన గణేశ్ మండపాల వద్ద నిర్వాహకులు విశేష పూజలు నిర్వహిస్తున్నారు. ప్రత్యేక సెట్టింగ్‌లు, విద్యుత్ దీపాలు, పూలతో అందంగా అలంకరించిన మండపాలను సందర్శించేందుకు పరిసర కాలనీలు, బస్తీల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివస్తున్నారు. వివిధ రూపాల్లో కొలువైన గణపయ్యను దర్శించుకొని, పూజలు చేసి పరవశిస్తున్నారు. ఇలా ఉండగా, నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల్లో నెలకొల్పిన మండపాలను ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, కార్పొరేటర్లు, వివిధ పార్టీ నాయకులు, పోలీసు అధికారులు సందర్శించి పార్వతీ తనయుడికి పూజలు చేశారు.

– ఎల్బీనగర్, మలక్‌పేట జోన్ బృందం



చంపాపేట సాయిరామ్‌కాలనీలో... ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి



హస్తినాపురంలోని భీమానగర్ కాలనీలో... కార్పొరేటర్ సుజాతనాయక్ తదితరులు



ఆర్‌కేపురం నారాయణ స్కూల్ మండపంలో... విద్యార్థులు, ప్రిన్సిపాల్ తదితరులు



దిల్‌సుఖ్‌నగర్‌లోని రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ వద్ద.. ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, లక్ష్మీనారాయణ, శంకర్



మన్సూరాబాద్ చంద్రపురికాలనీలో మాజీ కార్పొరేటర్ ముద్దగౌని లక్ష్మీప్రసన్నగౌడ్



బీఎన్‌రెడ్డినగర్‌లో కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి, బీజేపీ రంగారెడ్డి అర్బల్ జిల్లా అధ్యక్షుడు రంగారెడ్డి



సైదాబాద్‌లో.. కొత్త ఇన్‌స్పెక్టర్ రాఘవేందర్‌ను సన్మానిస్తున్న మాజీ డిప్యూటీ మేయర్ సుభాష్‌చందర్జీ



ఓల్డ్‌మలక్‌పేట సాయిగణేశ్ భవన్‌లోని మండపంలో...

దివ్యాంగులకు ప్రభుత్వం అండ



దివ్యాంగులకు బ్యాటరీ ట్రై సైకిళ్లను అందజేస్తున్న మంత్రి సబితారెడ్డి

దిల్‌సుఖ్‌నగర్: తెలంగాణ ప్రభుత్వం దివ్యాంగులకు ఎల్లప్పుడూ అండగా ఉంటోందని, వారి సంక్షేమానికి చిత్తశుద్ధితో పని చేస్తోందని విద్యా శాఖ మంత్రి సబితారెడ్డి అన్నారు. బుధవారం జల్‌పల్లిలో జరిగిన కార్యక్రమంలో ఆర్‌కేపురం డివిజన్‌కు చెందిన దివ్యాంగ లబ్ధిదారులకు బ్యాటరీ ట్రై సైకిళ్లను మంత్రి అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలోని తెలంగాణ ప్రభుత్వంలో అన్ని వర్గాల వారు ఎంతో సంతోషంగా ఉన్నారన్నారు. దివ్యాంగులకు ఎక్కడలేని విధంగా తెలంగాణలో పెన్షన్ ఇస్తున్నామన్నారు. రూ. 40 వేల విలువ చేసే ఈ సైకిల్ ఒక్కసారి చార్జింగ్ చేస్తే 30 కిలో మీటర్లు ప్రయాణం చేస్తుందని, దివ్యాంగులు తమ పనులకు ఎవరిపై ఆధారపడకుండా సొంతగా చేసుకోవచ్చనే భరోసా కలుగుతుందన్నారు. బీఆర్ఎస్ ఆర్‌కేపురం డివిజన్ అధ్యక్షుడు నగేష్ మాట్లాడుతూ... ఆర్‌కేపురం డివిజన్ కి చెందిన ఆరుగురు దివ్యాంగులకు మంత్రి చేతుల మీదుగా బ్యాటరీ ట్రై సైకిళ్లను అందజేశారన్నారు. మహేశ్వరం నియోజకవర్గం ప్రధాన కార్యదర్శి అరవింద్ శర్మ, మహిళా అధ్యక్షురాలు ఊర్మిళా రెడ్డి, కార్యదర్శి అనురాధ శర్మ, మురళీధర్ రెడ్డి, పెంబర్తి శ్రీనువాస్, జగన్మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.